క్లుప్తంగా

మద్దిలో అభిషేక పూజలు



ఉత్సవమూర్తికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవ మూర్తికి శనివారం శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించి నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాదం స్వీకరించారు. తణుకు నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి, జాయింట్ చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్, జాయింట్ సెక్రటరీ ఆదూరి వెంకటేశ్వరావు దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు వేదాశీర్వచనం చేసి, స్వామివారి శేష వస్త్రం, స్వామి చిత్రపటం అందజేశారు.

పారిజాతగిరిలో పూజలు



వేంకటేశ్వరస్వామిని దర్శించిన జడ్జి సత్యవతి కుటుంబసభ్యులు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. కుక్కునూరు మండలం వెంకటాపురం గ్రామస్తులు స్వామి వారికి ఏడు వారాలు 108 ప్రదక్షిణలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి, వారి కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి మానికల రాంబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాలు అనంతరం వారిని వేదాశీర్వాదంతో సత్కరించారు.

భద్రాద్రికి చేరిన పాదయాత్ర



భద్రాచలానికి చేరుకున్న పొంగుటూరుకు చెందిన భక్త బృందం

కొయ్యలగూడెం: పొంగుటూరు గ్రామం నుంచి భద్రాచలానికి నిర్వహించిన పాదయాత్ర శనివారంతో పూర్తయిందని పొంగుటూరు భక్తులు పేర్కొన్నారు. ఈనెల ఒకటో తేదీన పొంగుటూరు నుంచి యాత్ర ప్రారంభం కాగా ఐదు రోజులపాటు అరవై మందికి పైగా సభ్యులు పాదయాత్ర చేస్తూ భద్రాచలానికి చేరుకున్నామన్నారు. మొట్టమొదటిసారిగా ఆధ్యాత్మిక పాదయాత్రను చేయడం తమలో భక్తి చింతనను నింపిందని ఈ సందర్భంగా వారు తెలిపారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొని పొంగుటూరుకు చేరుకుంటామని చెప్పారు.

వేడుకగా శివ కల్యాణం



శివదేవుని కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని అట్టహాసంగా నిర్వహించిన ఈ వేడుక భక్తులకు నేత్రపర్వమైంది. సుముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల శివనామస్మరణల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను కన్నులపండువగా జరిపి, కల్యాణ మూర్తులకు హారతులిచ్చారు. ఈ వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సగర్ల అభివృద్ధికి కృషి చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సగర్లకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, అన్ని ఎన్నికల్లో సగర్లకు కొన్ని సీట్లను రాజకీయ పార్టీలు కేటాయించి, తమ రాజకీయ అభివృద్ధికి సహకరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాడిశెట్టి గోపీరావు కోరారు. ఏలూరు జీహెచ్‌డీ ఎంపైర్‌లో నిర్వహించిన సగర సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. సగర్లకిచ్చే కుల ధ్రువీకరణ పత్రాల్లో సగర (ఉప్పర) అని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా కుప్పాల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా తాడిశెట్టి శివప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా గండికోట సీతారామరాజు, కోశాధికారిగా తాడిశెట్టి శివయ్య, జిల్లా యువజన అధ్యక్షుడిగా ఇబ్బా నాగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శిగా గాదె వెంకట రమణ, ఏలూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా కగ్గా ప్రసాద్, యువజన అధ్యక్షునిగా రెడ్డి రామకృష్ణ, గోపాలపురం నియోజకవర్గ అధ్యక్షుడిగా దండ్రు వీరపాండు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పరి సురేష్, కోశాధికారి జక్కు అప్పారావు, సీనియర్ నాయకులు రెడ్డి రాంబాబు, గండికోట చిన రంగారావు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత బాబూ జగ్జీవన్‌రామ్

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి
- వాడవాడలా జగ్జీవన్‌రామ్ జయంతి

జంగారెడ్డిగూడెం: సామాజిక న్యాయం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి, దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ అని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా జంగారెడ్డిగూడెంలోని ఆయన విగ్రహానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, కౌన్సిలర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, పట్టణ ప్రముఖులు పూలమాలల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ దళిత కుటుంబంలో జన్మించిన జగ్జీవన్‌రామ్ చిన్నతనంలోనే వివక్షను ఎదుర్కొన్నా పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని ఛైర్‌పర్సన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, ముప్పిడి శ్రీను, జెట్టి సత్య ఆదిత్య, నేకూరి కిషోర్, బత్తిన చిన్న, దిర్సిపోము రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. స్థానిక ఎస్సీ పేట 6, 7, 8 వార్డులకు సంబంధించి నవచైతన్య అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పాతబస్టాండ్ జగజ్జీవనరామ్ విగ్రహం నుంచి ఏలూరు రోడ్డు జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు కృషిచేసిన మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అలాగే స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి

బుట్టాయగూడెం: అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మాజీ ఉపప్రధాని బాబూ జగజ్జీవన్‌రామ్ అని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ అన్నారు. కేఆర్‌పురం ఐటీడీఏలో బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పీవో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక అరుంధతీ కాలనీ వద్ద ఉన్న బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి కేవీపీఎస్ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ పేరిట జిల్లా ఏర్పాటు చేయాలి

కొయ్యలగూడెం: భారతరత్న మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ పేరును రాష్ట్రంలో ఒక జిల్లాకి పెట్టాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దూలపల్లి కాంతారావు ఆధ్వర్యంలో కొవ్వూరు రోడ్డులోని జగజ్జీవన్ రామ్ విగ్రహం వద్ద జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన సోమరాజు, ఎంపీపీ గంజిమాల రామారావు, మేకల అన్నవరం, గొడ్డటి నాగేశ్వరరావు, తాడిగడప రామకృష్ణ, నూకల రాము, గంటా శ్రీను, సంకుకొండ, ఏలేటి చంద్రం తదితరులు పాల్గొన్నారు. కన్నాపురం, గవరవరం, పొంగుటూరు, కొవ్వూరు రోడ్డు దళితవాడలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



కొయ్యలగూడెం: బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

జంగారెడ్డిగూడెం: జగ్జీవన్‌రామ్‌కు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి నివాళి

పోలవరం రూరల్: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పోలవరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణ బయట ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పోలవరం మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తోలేటి రఘు, ఉండ్రాజవరపు మూర్తి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. పోలవరం ఎస్సై పవన్‌కుమార్ చేతుల మీదుగా పేదలకు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

టి.నరసాపురం: కుల వివక్షపై అలుపెరుగని పోరాట యోధుడు, సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్ అని మండల ప్రముఖులు పేర్కొన్నారు. టి.నరసాపురంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం నిర్వహించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఎస్సై ఎం.జయబాబు, అడపా నాగరాజు, దేవరపల్లి ముత్తయ్య, లంక జయబాబు, సీహెచ్ నవీన్, నందిపాము రవి, నార్లపాటి దుర్గయ్య, బాబు జగజ్జీవనరామ్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఆదర్శంగా తీసుకోవాలి

చింతలపూడి: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్దనున్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ నివాళులు అర్పించారు. పలువురు దళిత సంఘాల నేతలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, బీసీ సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగజ్జీవన్‌రామ్ సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. దళితుల అభ్యున్నతి కోసం జగ్జీవన్‌రామ్ పాటు పడ్డారని కొనియాడారు. మండలంలోని ప్రగడవరం, రాఘవాపురం, యర్రగుంటపల్లి, ఉర్లగూడెం తదితర గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు.

లింగపాలెం: ధర్మాజీగూడెంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మాజీ లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుళ్లపూడి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

కామవరపుకోట: ఆడమిల్లి గ్రామంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, కుల రహిత సమాజం కోసం కృషిచేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని, ఆయన మంత్రిగా, ఉప ప్రధానిగా దేశానికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. అనంతరం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మలకలపల్లి నరసింహారావు వెన్ను ఆపరేషన్ చేసుకున్న కారణంగా ఆయన్ను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కడిమి రమేష్, మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, ఆడమిల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు బీమేశ్వరావు, ఎంపీటీసీ సాయి, సర్పంచ్ రామమోహన్‌రావు, శ్రీను, వేముల సాయి, ఎస్సీ సెల్ కన్వీనర్ కాంతారావు, ప్రభాకర్ ఆనంద్, నాగ మల్లేశ్వరావు, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న కంభం విజయరాజు



బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న పీఓ రాములు నాయక్



పోలవరం రూరల్: పోలవరంలో పేదలకు బిర్యాని ప్యాకెట్లు అందజేస్తున్న ఎస్సై పవన్‌కుమార్



టి.నరసాపురం: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



చింతలపూడి: జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

- ముస్తాబైన రామాలయాలు
- చలువ పందిళ్లు, విద్యుత్‌దీపాలంకరణలతో ఆలయాల వద్ద సందడి

బుట్టాయగూడెం: మర్యాద పురుషోత్తముడు శ్రీరామచంద్రుడి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నవమి వేడుకలకు మన్యం, మెట్ట ప్రాంతాల్లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ ఏర్పాట్లలో రామాలయాల వద్ద సందడి నెలకొంది. నవమి వేడుకలకు గిరిజన ప్రాంతంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. బుట్టాయగూడెంలో సుమారు 63 సంవత్సరాల క్రితం నిర్మించిన రామాలయంలో ఈ ఏడాది శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దుద్దుకూరులో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం

కొయ్యలగూడెం: శ్రీరామనవమి ఉత్సవాలకు మండల వ్యాప్తంగా ఉన్న రామాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. ఆదివారం శ్రీసీతారామ కల్యాణ వేడుకకు కమిటీల సభ్యులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. కన్నాపురంలోని దేవాదాయ శాఖ పరిధిలో ఉండే రామాలయానికి చెందిన బ్యాంకు లాకర్లలో భద్రపరిచిన పంచలోహ విగ్రహాలను బయటకు తీశారు. శ్రీ సీతారామ లక్ష్మణ హనుమద్ విగ్రహాలకు సంప్రోక్షణ చేసి కల్యాణోత్సవం చేయనున్నారు. కొయ్యలగూడెంలోని ప్రధానంగా ఉన్న నాలుగు రామాలయాలతో పాటుగా మండల వ్యాప్తంగా నలభై చోట్లకు పైగా నవమి ఉత్సవాలు మూడు రోజుల నుంచి తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్నారు.

వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో కొలువైన శ్రీ సీతారామస్వామి (వైకుంఠ రాముడు) వార్షిక కల్యాణోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో తొలి రోజు తోరణాలు కట్టడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు మేడూరి వెంకట పార్థసారధాచార్యులు, పెరవలి శాయి రామాచార్యులు ఆధ్వర్యంలో వైఖానస ఆగమానుసారంగా పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. శనివారం ఉదయం శ్రీరామస్వామిని పెండ్లికుమారుడిగా, సీతమ్మ అమ్మవారిని పెండ్లికుమార్తెగా ముస్తాబు చేశారు. అలాగే ఆలయంలో పసుపుకొట్టే కార్యక్రమం, వడిబియ్యం నిర్వహించి, విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. రాత్రి ధ్వజపట ప్రతిష్ఠ, ధ్వజారోహణ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా ఆదివారం ఉదయం 10.30 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

పూర్తయిన ఏర్పాట్లు

ద్వారకాతిరుమల: మండలంలో శ్రీరామ నవమి వేడుకలకు ఉత్సవ కమిటీల సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా స్థానిక చెరువు వీధిలో రెండు చోట్ల, మావులేటి సోమరాజు సదనం వద్ద ఇలా పలు ప్రాంతాల్లో సీతారాముల కల్యాణాన్ని అట్టహాసంగా జరుపనున్నారు. అందులో భాగంగా మందిరాలను నిర్మించి, వాటిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.



బుట్టాయగూడెం: రామాలయంలో సీతారామలక్ష్మణ ఆంజనేయుల విగ్రహాలు



జంగారెడ్డిగూడెం: వివాహానికి ముస్తాబైన సీతారాములు



కామవరపుకోట: తూర్పు యడవల్లి శ్రీ సీతారామచంద్రస్వామి

చిన్న భద్రాద్రిలో ఏర్పాట్లు

కామవరపుకోట: తూర్పు యడవల్లిలో కొలువైయున్న శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో వసంత నవరాత్రోత్సవ కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అర్చకులు అలహరి శేషాచార్యులు తెలిపారు. ఆదివారం ఉదయం స్వామివారి కల్యాణ మండపంలో వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కల్యాణ ఘట్టానికి ఆలయ నిర్మాణ కర్తలు కోటగిరి విద్యాధరరావు కుటుంబ సభ్యులు, ద్వారకాతిరుమల దేవస్థానం ఛైర్మన్ సుధాకర్ రావు, ఈవో ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు తీసుకువస్తారని చెప్పారు. తూర్పు యడవల్లి రామాలయంలో భద్రాచలంలో వలె రాముని తొడపై సీతమ్మ వారు కూర్చుని ఉంటారు. అలాగే ఆలయ ప్రాకారములో చిన్ని కృష్ణుని విగ్రహం, రాశుల విగ్రహాలు విశేషంగా భక్తులను ఆకట్టుకుంటాయి. ఆలయ ప్రాంగణంలో కల్యాణం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం తాటాకు చలువ పందిళ్లు, గ్రీన్ మ్యాట్లు ఏర్పాటు చేశారు. కల్యాణ ఘట్టాల్లో భాగంగా ఆదివారం ఎదుర్కోలు ఉత్సవం, ఊరేగింపు ఉంటాయని, సోమవారం స్వామివారి పట్టాభిషేక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు శేషాచార్యులు తెలిపారు.



కొయ్యలగూడెం: స్వామివారి కల్యాణానికి పూలమాలలను సిద్ధం చేస్తున్న మహిళలు



కొయ్యలగూడెం: వాటర్ ట్యాంక్ రామాలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం



ద్వారకాతిరుమల: చెరువు వీధిలో మందిరాన్ని ముస్తాబు చేస్తున్న కమిటీ సభ్యులు

ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



గుంటుపల్లి గుహల వద్ద ప్రకృతిపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కామవరపుకోట: ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో జీలకర్రగూడెంలోని గుంటుపల్లి బౌద్ధారామం నందు ప్రకృతి శిబిరాన్ని నిర్వహించారు. ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకులు పి.స్రవంతి ఆదేశాలను అనుసరించి ప్రభుత్వ యాజమాన్య పరిధిలోగల 8 ఉన్నత పాఠశాలలకు చెందిన 60 మంది ఏకో క్లబ్ విద్యార్థులు, 8 మంది ఉపాధ్యాయులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. ఉదయం విద్యార్థులు వివిధ రకాల విత్తనాలను, పువ్వులను, ఆకులను సేకరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి వనరులను దుర్వినియోగం చేయకుండా భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. చెట్లను నాటాలి, వ్యర్థాలను తొలగించాలి, పర్యావరణాన్ని హాని కలిగించే కార్యకలాపాలను నివారించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతిపై విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే తలారి పరామర్శ



నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: స్థానిక వైఎస్సార్ సీపీ నేత ఇమ్మడి నాగుని గోపాలపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్త తలారి వెంకట్రావు శనివారం పరామర్శించారు. ఇటీవల నాగు తండ్రి నారాయణరావు మృతి చెందారు. నాగు ఇంటికి వెళ్లిన తలారి ముందుగా నారాయణరావు చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం నాగుని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పార్టీ గోపాలపురం నియోజకవర్గ మేధావుల ఫోరమ్ అధ్యక్షుడు పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, అచ్యుత ఏసుబాబు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, కొల్లి సుబ్బారావు, రుద్ర శివాజీ, మానుకొండ సుబ్బారావు తదితరులున్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

కొయ్యలగూడెం: నాగాంజలి మృతికి కారణమైన దీపక్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఐ కొయ్యలగూడెం మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి కిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తూ, ఇంటర్న్ షిప్ చేస్తున్న నాగాంజలి ఆత్మహత్యకు పాల్పడగా కిమ్స్ ఆసుపత్రిలోనే ఆమెకు మెరుగైన వైద్యం అందించకపోవడం వలన ఆమె మృతి చెందిందని ఆంజనేయరాజు ఆవేదన వ్యక్తం చేశారు. నాగ అంజలి మృతికి కారణమైన దీపక్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.

15లోగా పశుగణన పూర్తిచేయాలి

ద్వారకాతిరుమల: రాష్ట్ర పర్యటనలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సలహాదారు(గణాంకాలు) జగత్ హజారికా శనివారం చినవెంకన్న దివ్య క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. ఆ తరువాత 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ముందుగా శ్రీవారి గోసంరక్షణ శాలలో ఈ తనిఖీలు జరిపారు. అనంతరం సూర్యచంద్రరావుపేట గ్రామంలో క్షేత్ర స్థాయిలో పర్యటించి పాడి రైతులు, మేకలు, గొర్రెల పెంపకందారుల వద్ద నుంచి వివరాలను సేకరించారు. అలాగే పశు గణన చేస్తున్న ఎన్యూమరేటర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగత్ హజారికా మాట్లాడుతూ పశు గణన కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ టి.గోవిందరాజు, డాక్టర్ శ్రీనివాస రాజు, చందు, భీమడోలు ఏడీ డాక్టర్ సాయి రమేష్, డాక్టర్ హర్ష, ద్వారకాతిరుమల మండలం పశు వైద్యాధికారి అంగర సురేష్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీవారి గోసంరక్షణ శాలలో ఒంగోలు గిత్తను పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వ సలహాదారు జగత్ హజారికా